www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 195 | హైదరాబాద్ | శుక్రవారం | 07-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## టెక్నాలజీ జోడించి వైద్య సేవలు మెరుగుపర్చాలి..

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**



ఆధునికత, టెక్నాలజీ జోడించి వైద్య సేవలు మెరుగుపర్చే దిశగా కొత్తగా వచ్చిన గ్రూప్ 1 ఆఫీసర్లు ఆలోచన చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖకు కేటాయించిన గ్రూప్ 1 ఆఫీసర్లు గురువారం సెక్రటేరియట్‌లో మంత్రిని కలిశారు. ఆరోగ్య శాఖలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టమని, అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఎంతోమందికి సేవ చేసే అవకాశం ఈ డిపార్ట్‌మెంట్‌లో ఉంటుందని మంత్రి వారితో పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు అత్యంత పేద ప్రజలు వస్తుంటారని, వారిని ఆప్యాయంగా ప్రేమగా చూసుకునే బాధ్యత ఈ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచేలా, నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా పని చేయాలని కొత్త ఆఫీసర్లకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా హాస్పిటళ్ల పనితీరు, ఆరోగ్య రంగంలో టెక్నాలజీ, గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకు స్పెషాలిటీ వైద్య సేవలు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులకు మంత్రి వివరించారు. ఒకప్పటిలా ఇప్పుడు అంటువ్యాధుల సమస్య లేదని, వాటి స్థానంలో లైఫ్ స్టైల్ డిసీజెస్ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) సమస్య పెరిగిందని ఈ పరిస్థితిని అవగాహన చేసుకోవాలని మంత్రి సూచించారు.

# కలిసికట్టుగా పనిచేయాలి

**ఉప ఎన్నికల్లో చిన్నపాటి నిర్లక్ష్యం లేకుండా**

**కలిసికట్టుగా పని చేయాలని సూచన**

**మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి**

**ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని సూచన**



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో పార్టీ ముఖ్య నాయకులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉప ఎన్నికల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మరియు అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓటింగ్‌కు మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉన్నందున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొత్తం మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఆయన సూచించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటికే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడపగడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా గత నెల 31 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్డు షోలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహాలు, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్షించినట్లు సమాచారం.

# ఉప ఎన్నికలో 25 వేల ఓట్లు వస్తే.. కిషన్ రెడ్డికి మరొకసారి పొన్నం ఛాలెంజ్!

- కిషన్ రెడ్డికి మరొకసారి పొన్నం ఛాలెంజ్
- నేను చెప్పింది చేయడానికి కిషన్ రెడ్డి సిద్ధమా?
- యూసఫ్ గూడలో ప్రచారంలో హైదరాబాద్ ఇంచార్జి పొన్నం



**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి సవాల్ విసిరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన అభ్యర్థికి 25 వేల ఓట్లు వచ్చాయని, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో 25 వేలకు ఒక్క ఓటు తగ్గకుండా తీసుకువస్తే.. మీరేం (కిషన్ రెడ్డి) చెబితే అందుకు తాను సిద్ధం అని చెప్పారు. 25 వేల ఓట్లు బీజేపీ అభ్యర్థికి రాకపోతే.. తాను చెప్పింది చేయడానికి కిషన్ రెడ్డి సిద్ధమా? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పది వేల లోపే బీజేపీకి ఓట్లు వస్తాయని పొన్నం ప్రభాకర్ జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్ గూడలో ప్రచారంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం పాల్గొన్నారు.

ఎన్టీవీతో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా మాట్లాడుతూ... 'మా అభ్యర్థి యువకుడు, స్థానికుడు, ఉత్సాహవంతుడు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. గతంలో అధికారంలో ఉండి కూడా అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు మావైపు ఉన్నారు. మేము అధికారంలోకి వచ్చి అందించిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ తరపున సానుకూలంగా ఉన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని అభివృద్ధి చేయించుకుంటున్నారో.. ఇక్కడి ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపించి అభివృద్ధి చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ పెన్షన్లు ఇచ్చిన నిధులను కూడా లెక్క చెబితే.. అది అభివృద్ధి అవుతుందా?. అభివృద్ధి చేయడం అంటే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా డెవలప్ చేయడం. ఈ రెండు నెలల్లోనే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా 2500 కోట్ల అభివృద్ధి పనులను చేశాము' అని అన్నారు.

# ఆ సర్వేలను మేం నమ్మం!

- జూబ్లీహిల్స్ బైపోల్‌ను రెఫరెండంగా తీసుకోం
- ఈ ఉప ఎన్నిక ఎవరూ కోరుకోలేదు
- ప్రజలు ఎవరికి ఓటు వేయాలనే స్పష్టతకు ఇంకా రాలేదు
- సర్వేల పేరుతో హడావుడి ఎందుకు?
- మీట్ ది ప్రెస్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**




జూబ్లీహిల్స్ బైపోల్‌ను తాను రెఫరెండంగా తీసుకోబోనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఎందుకంటే ఈ ఉప ఎన్నిక ఎవరూ కోరుకోనిదని వివరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో కిషన్ రెడ్డి పలు అంశాలను వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎవరూ కోరుకోలేదని, మూడు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నడూ జూబ్లీహిల్స్ నుంచి బీజేపీ గెలవలేదని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో తాము 3వ స్థానానికి పరిమితమయ్యామన్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచినట్లు చెప్పారు.

**సర్వేలను నమ్మం**

ఈ ఉప ఎన్నికలో ప్రజలు ఎవరికి ఓటు వేయాలనే స్పష్టతకు ఇంకా రాలేదని కిషన్ రెడ్డి అన్నారు. కానీ, కొందరు సర్వేల పేరిట హడావుడి చేస్తున్నారని, దాన్ని తాము విశ్వసించడం లేదని తెలిపారు. సర్వేలను తాను కొట్టిపారేయడం లేదని, కానీ అందులో ఒక్కటి కూడా పేరున్న సంస్థలు నిర్వహించలేదని, అందుకే విశ్వసించడం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో, మండలాల్లో జరిగే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో జరగకపోవడం దురదృష్టకరమని వివరించారు. హైటెక్ సిటీలో రోడ్లకు రంగులు వేసినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లు కాదని విమర్శించారు. చిన్న చిన్న కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

**బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్‌దే బాధ్యత**

జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు నగరానికి అత్యంత ప్రధానమని, ఆ సంస్థలు నిధులు లేక విలవిల్లాడుతున్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు 10 ఏండ్లు పాలించిన బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ కూడా బాధ్యత వహించాలన్నారు. ఈ ఉప ఎన్నికలో 6 గ్యారెంటీలు, 420 సబ్ గ్యారెంటీలపై కాంగ్రెస్ ఎక్కడా ప్రస్తావించడం లేదని తెలిపారు. పాదయాత్ర చేస్తే డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతున్న నీటిలోనే తిరగాల్సిన పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. రెండేండ్లలో ఎన్నికల హామీలు ఎలా పరిష్కరిస్తున్నారో ప్రజలకు కాంగ్రెస్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ కూడా యువతను మోసం చేస్తున్నదన్నారు.

**కేంద్ర నిధుల లెక్కలు బయటపెట్టాలి**

సకల సమస్యలకు పరిష్కారంగా ఫ్రీ బస్సును కాంగ్రెస్ చూపుతున్నదని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. మెట్రో ఫేస్ 2ను అడ్డుకుంటున్నానని తనపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రమంత్రిగా పలు అభివృద్ధి పనులకు ల్యాండ్ సమస్య ఉంటే పరిష్కరించి కేటాయించాలని కేసీఆర్‌కు స్వయంగా 40 లేఖలు రాశానని, అయినా స్పందించలేదన్నారు. ఇప్పుడు వారు కూడా తనపై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయితీలకు గత, ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలని, కేంద్రం ఎన్ని కేటాయించిందనేది బయట పెట్టాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు ఇక్కడే రిటైర్ అయితే వారి రాష్ట్రానికి వెళ్లకుండా తెలంగాణలోనే సెటిల్ అవుతున్నారని, కానీ ఇక్కడి ఐఏఎస్‌లు మాత్రం రిటైర్‌మెంట్‌కు ముందే లగేజ్ ప్యాక్ చేసి రాష్ట్రానికి పంపిస్తున్నారంటే హైదరాబాద్ గ్లోబల్ సిటీ కాబట్టేనని పేర్కొన్నారు. అలాంటి మహానగరంలో అభివృద్ధి చేపట్టకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.

**బీజేపీ గెలుపు ఖాయం**

గతంలో ఎన్నికల సందర్భంగా ఎంఐఎం కేవలం మద్దతు ఇచ్చిందని, కానీ ఈ ఎన్నికల్లో మాత్రం అసద్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ కోసం ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఫ్యామిలీ పార్టీలని, ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి రెండేళ్ల క్రితమే ఇవ్వొచ్చని, ఆలస్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ కచ్చితంగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తారా లేక వర్చువల్‌గా ప్రారంభిస్తారా అనేది తెలియాల్సి ఉన్నదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# చెలరేగిన బౌలర్లు.. కుప్పకూలిన ఆసీస్..

- నాలుగో టీ20లో భారత్ ఘన విజయం
- 48 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌లో 2-1 ఆధిక్యం
- భారత బౌలర్ల ధాటికి 119 పరుగులకే కుప్పకూలిన ఆసీస్
- చివరి 28 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన కంగారులు
- వాషింగ్టన్ సుందర్‌కు మూడు, అక్షర్, దూబేలకు చెరో రెండు వికెట్లు

**నేషనల్‌బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. టీమిండియా బౌలర్ల ధాటికి ఆసీస్ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. ఫలితంగా సూర్య సేన 48 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 21 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

క్వీన్స్‌లాండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ 46 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (28), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (10 బంతుల్లో 20), అక్షర్ పటేల్ (21), శివమ్ దూబే (22) పరుగులతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించారు.

అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా, భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. ఒక దశలో పటిష్ఠంగానే కనిపించిన ఆసీస్, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి పరాజయం పాలైంది. ముఖ్యంగా చివరి 28 పరుగుల వ్యవధిలోనే 7 వికెట్లు కోల్పోయి 119 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ చివర్లో మూడు కీలక వికెట్లు పడగొట్టగా, ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన అక్షర్ పటేల్, శివమ్ దూబే చెరో రెండు వికెట్లు తీసి ఆసీస్ పతనంలో కీలక పాత్ర పోషించారు. అలాగే అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ పడగొట్టారు. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ తీసుకున్న నిర్ణయాలు కూడా భారత్ విజయానికి దోహదపడ్డాయి. బౌలింగ్ మార్పులు, డీఆర్ఎస్ కాల్స్‌లో అతను చూపిన చురుకుదనం ఫలితాన్నిచ్చింది. సిరీస్‌లో మరొక మ్యాచ్ మిగిలి ఉండగా, భారత్ సిరీస్ కైవసం చేసుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది.




# డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే మూలం

- రేవంత్ రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి ఆగలేదన్న తుమ్మల
- పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతున్నారన్నది అవాస్తవమని వ్యాఖ్య
- ఎన్నికల ఫలితాలు చూసైనా బీఆర్ఎస్ నేతలు మారాలని హితవు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పెరిగిన డ్రగ్, గన్ కల్చర్‌కు కేటీఆరే మూలమంటూ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న 'బాకీ కార్డు' ప్రచారాన్ని తిప్పికొడుతూ, బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, రాష్ట్రంపై పెట్టిన లక్షల కోట్ల అప్పుల సంగతేంటని నిలదీశారు. ఈరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం తుమ్మల మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత 20 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రేవంత్ రెడ్డి పాలన కారణంగా పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి వెళ్లిపోతున్నారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తుమ్మల తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవమని, రోజూ ఎందరో పారిశ్రామికవేత్తలు కొత్త పెట్టుబడులతో తెలంగాణకు వస్తున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇటీవలి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను గుర్తుంచుకోవాలని తుమ్మల హితవు పలికారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారు. అలాంటి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు" అని ఆయన అన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భారత రాష్ట్ర సమితి మైనార్టీ నేతలు ఎన్నికల ప్రధానాధికారికి (సీఈవో) ఫిర్యాదు చేశారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే షకీల్‌తో మైనార్టీ నేతలు సీఈవో కార్యాలయానికి వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ముస్లింలపై బెదిరింపు ధోరణితో ప్రసంగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన మాట్లాడారని ఆక్షేపించారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఓట్ల కోసం కాకుండా హామీల అమలు కోసం కూడా కాంగ్రెస్ పని చేయాలి

- **BRSV రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్**

**చేర్యాల, నవంబర్ 6 (సిద్దిపేట పవర్)**

హామీలు అమలు చేయక చతికిల పడ్డ కాంగ్రెస్ మార్పు పేరిట తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు అన్నారు.. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం తథ్యమని అక్కడ ప్రజలు అధికార కాంగ్రెస్ను ఆదరించడం లేదన్నారు ఎన్ని కుట్రలు చేసిన బిఆర్ఎస్ విజయం ఖాయం అన్నారు..వారికి ఓట్ల అవసరం ఉన్నపుడే ప్రజలు గుర్తుకు వస్తున్నారు అని, హామీల అమలు కోసం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుర్తు రావడం లేదు అని తెలిపారు..కేసీఆర్ కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష అభ్యంతరకరమని అన్ని వర్గాల ప్రజలు సీఎం మాట్లాడుతున్న తీరును చూసి ముక్కున వేలేసుకుంటున్నట్లు తెలిపారు.. ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తే గానుగుపాడు నాయకులపై పోలీసులు కేసులు పెట్టడం సరికాదన్నారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గానుగపాడు ప్రజలకు అండగా నిలబడ్డారని ప్రజా సమస్యల పరిష్కారమే ఎమ్మెల్యే పళ్ళ లక్ష్మమన్నారు రానున్న రోజుల్లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలను ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపడుతుందన్నారు.. ఆయనతో గర్నపెల్లి చంద్రం, షేక్ సుభాని, నరేష్ గౌడ్, సాయిలు, గణేష్, హామీన్ పాల్గొన్నారు








## తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోవడమే ధ్యేయం

- **బీసీ జేఏసీ పోరాట యోధులు జేఏసీ కన్వీనర్ బాలరాజు**

**సిద్దిపేట పవర్ నవంబర్ 6 మిరుదొడ్డి**

తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకోవడమే ధ్యేయంగా బీసీ జేఏసీ పోరాడుతుందని జేఏసీ కన్వీనర్ బాలరాజు, కో కన్వీనర్ గంగాపురం మహేష్ కానుగంటి శ్రీనివాస్ లు అన్నారు. రిజర్వేషన్లు ఎవరిచే బిక్ష కాదు అని , బీసీల హక్కు అని తెలిపారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మౌన దీక్ష చేపట్టారు. బీసీల మౌన దీక్షలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసి జెయింట్ యాక్షన్ కన్వీనర్ బాలరాజు, కో కన్వీనర్లు శ్రీనివాస్ మహేష్ లు మాట్లాడుతూ, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల ప్రభుత్వం, నాయకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే వరకు బీసీలు ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్లు వ్యతిరేకించే పార్టీలతో పాటు నాయకులపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రాతి ప్రకరణ ప్రకారం ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కిష్టయ్య, యాదగిరి, అమర్, దేవరాజు, రాములు, హైమద్, స్వామి, కుమార్, మహేష్ పలువురు పాల్గొన్నారు.

## ఎం ఎన్ కే విట్టల్ సెంట్రల్ కోర్టులో ఘనంగా కార్తీక దీపోత్సవం ...

**సికింద్రాబాద్, నవంబర్ 06 (సిద్దిపేట పవర్):**

సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని సెంట్రల్ కోర్టు అపార్ట్ మెంటులో కార్తీక పూర్ణిమ సందర్భంగా దీపోత్సవం, శివారాధన ఘనంగా జరిగింది. రెసిడెంట్స్, ప్రత్యేకంగా మహిళలు ఉత్సాహం, భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జి. వనిత, లలిత, వంశీ, ఆర్. గాయత్రి, వి. రంగనాయకమ్మ, ప్రమీల, రామచంద్రన్, కే వి రమణారావు తదితరులు పాల్గొన్నారు.



**ఈ నెల 15న శివపార్వతి కళ్యాణం**

కార్తీక బహుళ ఏకాదశి, విశ్వావసు సంవత్సరం శనివారం 15 నవంబర్ రోజున సెంట్రల్ కోర్టులో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం పదకొండు గంటలకు శివపార్వతి కళ్యాణం వేడుక జరుపనున్నట్లు అధ్యక్షులు డాక్టర్ జి. హనుమాన్లు తెలిపారు. ఈ వేడుకకు అపార్ట్ మెంట్ రెసిడెంట్స్ అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని ట్రెజరర్ కే.సేతు మాధవ రావు, జాయింట్ సెక్రటరీ వి. శ్రీనివాసన్ కోరారు.

## 13 గంటల పాటు అరుదైన గుండె శస్త్రచికిత్స..

- **బేగంపేట కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో అరుదైన సర్జరీ సక్సెస్**

**సికింద్రాబాద్, నవంబర్ 06 ( సిద్దిపేట పవర్ ) :**

వరంగల్‌కు చెందిన 58 ఏళ్ల వ్యక్తికి బేగంపేట కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో చేసిన అరుదైన గుండె శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. రోగి గుండె ప్రధాన రక్తనాళం ఆయోర్టాలో 13.5 సెంటీమీటర్ల మేర ఏర్పడిన ఆన్యూరిజం కారణంగా పూర్తిగా బ్లాక్ అయినందున ఎండోవాస్క్యులర్ పద్ధతిలో 13 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారని హార్ట్ ఇన్‌స్టిట్యూట్ హెచ్ఓడీ, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి తెలిపారు. ఆయన గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మరో ఆస్పత్రిలో చికిత్స ఫలితం లేకపోవడంతో కిమ్స్ సన్‌షైన్ చేరిన రోగికి ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు, కార్డియాక్ సర్జన్లు, ఆనస్థీషియా బృందం సమిష్టిగా ఈ హైబ్రిడ్ విధానంలో ఆపరేషన్ నిర్వహించారు. కుడి కాలు రక్తనాళం ద్వారా గుండె ఆయోర్టాలోని బ్లాక్ ప్రాంతాన్ని వివిధ బెలూన్ల సాయంతో తెరచి, గ్రాఫ్ట్‌లు అమర్చడం ద్వారా రక్తప్రసరణను పునరుద్ధరించారు. డా.కస్తూరి శ్రీధర్ మాట్లాడుతూ..ఇది అత్యంత క్లిష్టమైన హై రిస్క్ శస్త్రచికిత్స. మెదడు, గుండెకు రక్తసరఫరా నిలవకుండా జాగ్రత్తలు తీసుకుంటూ శస్త్రచికిత్స విజయవంతం చేశాం. రోగి ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడు, రెండు రోజుల్లో డిశ్చార్జి అవుతాడు అని తెలిపారు .ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలేందర్‌సింగ్, డా. పి.ఎన్.రావు, డా. సందీప్ జనార్థన్, డా. సుబ్రహ్మణ్యం, డా. రాజారాం పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి బియ్యం అందచేత

**చేర్యాల, నవంబర్ 6 (సిద్దిపేట పవర్)**

చేర్యాల పట్టణంలోని పెద్దమ్మ గడ్డ రెండవ వార్డు లోని సన్మాల అనిల్ కుమార్ ఆరోగ్యం బాగోలేక కొద్దిరోజుల క్రితం చనిపోవడం జరిగింది..విషయం తెలుసుకున్న బి.ఆర్.ఎస్ నాయకులు పచ్చిమడ్ల సిద్ధిరాములు గౌడ్ ఈరోజు వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వట్టి శ్రీనివాస్, సన్మాల ప్రేమ్ కుమార్, ములుగు ప్రభాకర్, బండపల్లి వరుణ్, పుట్ట తిరుమలేష్, విజయ్ తదితరులు ఉన్నారు



## నైపుణ్యత, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించిన సెంట్ మేరీస్

- **విద్యాహక్కు చట్టం అమలుతో గ్రామీణ విద్యార్థులకు ప్రయోజనం**
- **డాక్టర్లు, ఇంజనీర్లు, పరిశోధకులు, విద్యావేత్తలుగా తీర్చిదిద్దిన గురువులు**
- **నామమాత్రపు రుసుముతో గ్రామీణ విద్యార్థులకు చక్కటి విద్యా బోధన**
- **సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ విద్యార్థుల ప్రదర్శనలు**
- **సెయింట్ మేరీస్ విద్యాలయంలో సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**

గ్రామీణ ప్రాంత వాతావరణంలో చక్కటి విద్యాబోధన అందిస్తూ సమాజానికి అత్యుత్తమ డాక్టర్లు, ఇంజనీర్లు, విద్యావేత్తలు, పరిశోధక విద్యార్థులను అందించిన ఘనత సెంట్ మేరీస్ యాజమాన్యానికి దక్కుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లోని సెయింట్ మేరీస్ సెయింట్ మేరీస్ విద్యాలయంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు కరస్పాండెంట్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో బాల శాస్త్రవేత్తలు రూపొందించిన ఎగ్జిబిషన్ ను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సెంట్ మేరీస్ పాఠశాలలో గురువులు విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ, సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి సమాజానికి అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దగా, ప్రస్తుతం వందలాదిమంది విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉన్నట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అమలు చేసిన విద్యాహక్కు చట్టం వంటి విద్యాభివృద్ధి పథకాలు అమలు చేయగా, నామమాత్రపు రుసుముతో విద్యనందించిన ఘనత దక్కించుకున్నట్లు తెలిపారు. విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తిస్తూ చక్కటి బాటలు వేయగా, తమను కన్న తల్లిదండ్రులకు, సమాజానికి ఆ ఫలాలు చేరుతున్నట్లు అన్నారు. నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించడంతోపాటు విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా ప్రోత్సహిస్తూ చక్కటి కార్యక్రమాలకు రూపకల్పన చేయగా, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అటల్ టింకరింగ్ ప్రయోగశాల, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటవ్వడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వం, విద్యార్థుల పరివర్తన, నూతన సాంకేతికత దిశగా దృష్టి పెట్టిన సెంటిమెరిస్ యాజమాన్యం ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఉన్నత విద్యా సంస్థగా పేరు తెచ్చుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం వంటి పథకాలకు చేయూతనందించినట్లు తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులను విద్యతోపాటు సామాజిక అంశాలలో శిక్షణ ఇస్తూ బాల మేధావులుగా తీర్చిదిద్దుతుండగా, రాష్ట్రంలోనే మేటి విద్యా సంస్థగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, మండల విద్యాధికారి కృష్ణ, ట్రెస్మా ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ రెడ్డి ప్రయివేట్ విద్య సంస్థల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి మహిళ తప్ప సరిగా విద్యాబోధన అభ్యసించాలి

- **ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు**
- **వయోజన విద్య సంపాదకులు వెంకటరెడ్డి**

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి నవంబర్ 6**

ప్రతి మహిళా తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని వయోజన ఉపసంచాలకులు వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం మీరుదొడ్డి మండల కేంద్రంలో మండల మహిళా సమైక్య కార్యాలయలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉలాస్, టాషు కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ తప్ప సరిగా విద్యాబోధనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు అనే నినాదంతో ప్రతీ మహిళా చదువు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి అర్ పి లు స్వరూప,సుమలత, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏపీఎం నర్సమ్మ, సీసీ లు జ్యోతి ,వైకుంఠం, ప్రభాకర్ బాలరాజు, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, అకౌంటెంట్ శారద, ఆపరేటర్ భాగ్య, వివోఏ లు, వివిధ గ్రామసంఘానికి చెందిన అధ్యక్షురాలు, కార్యదర్శిలు పాల్గొన్నారు.





## పంటల నష్టాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు

- **జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప**
- **సహాయ వ్యవసాయ సంచాలకులు ములుగు అనిల్ కుమార్**

**సిద్దిపేట పవర్‌జగదేవ్‌పూర్**

మండలంలోని జగదేవ పూర్ కాలువపై నిన్న నీటిపారుదల శాఖ అధికారులు గండి కొట్టిన కారణంగా పరిసర ప్రాంతాల్లో నీరు పొంగి పొర్లి సాగుచేసే వరి పత్తిపంటలకు తీవ్ర నష్టం కలిగింది. జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప, సహాయ వ్యవసాయ సంచాలకులు ములుగు అనిల్ కుమార్ నష్టపోయిన పంటలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన అంచనాల ప్రకారం, జగదేవపూర్ ఇటిక్యాల రెవెన్యూ గ్రామాలకు చెందిన సుమారు 60 ఎకరాల వరి పంట మరియు 40 ఎకరాల పత్తి పంట నీటిలో మునిగి దెబ్బతిన్నాయి. సంబంధిత గ్రామాల రైతులు ఈ సంఘటనతో తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఘటనాస్థలాన్ని సందర్శించి నష్టపరిహారం వివరాలను సేకరిస్తున్నారు. అవసరమైన సహాయ చర్యలు త్వరితగతిన అమలు చేయడానికి చర్యలు ప్రారంభించబడ్డాయని తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందకుండా మండల వ్యవసాయ అధికారి మరియు తహసీల్దార్ పర్యవేక్షణలో పంట నష్టం వివరాలు నమోదు చేసుకునేందుకు సహకరించవలసిందిగా రైతులను కోరారు. సంబంధిత శాఖల సమన్వయంతో కాలువను పునరుద్ధరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఖలీల్, లింగారెడ్డిపల్లి తాజా మాజీ సర్పంచ్ చంద్రం రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదాయంపై అశ్రద్ధ ఎందుకు?

- ఖాళీ షాపులను లీజుకు ఇవ్వడంలో అలసత్వం
- డిప్యూటీ కమిషనర్లకు మూడు రిమైండర్లు ఇచ్చినా దక్కని ఫలితం
- అమలుకు నోచుకోని స్టాండింగ్ కమిటీ తీర్మానం
- ఆధునీకరించి ఖాళీగా ఉంచిన చిక్కడపల్లి మార్కెట్
- పార్కింగ్ లేనందునే ముందుకు రాని అద్దెదారులు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభం నుంచి కోలుకోక ముందే ఆదాయంపై కొన్ని విభాగాలు అశ్రద్ధ వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బల్దియాను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకే ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్న భవనాలపై జీఐఎస్ సర్వే నిర్వహిస్తున్నామని, కమర్షియల్‌గా విని యోగిస్తూ రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న వేలం సంఖ్యల ఆస్తులను గుర్తిస్తున్నామని చెబుతున్న అధికారులు.. జీహెచ్ఎంసీ ఇతర ఆదాయ విభాగాలపై ఫోకస్ పెట్టడంలో విఫలం అవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. 30 సర్కిళ్లలో జీహెచ్ఎంసీకి రూ. లక్షల కోట్ల విలువ చేసే ఆస్తులున్నాయి. వీటిలో కనిష్టంగా రూ.5 వేల మొదలుకుని రూ.5 లక్షల వరకు అద్దెలు వచ్చే ఆఫీస్ ప్రాంగణాలు, మలిగీలు, మార్కెట్‌లోని స్టాల్స్ ఉన్నాయి. వీటిలో మున్సిపల్ మార్కెట్లు, కమర్షియల్ కాంప్లెక్సులు, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాళ్లు వంటివి ఉన్నాయి. అందులో సగానికి పైగా ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. ఆక్రమించుకుని ఉన్న మలిగీలు, ఆఫీస్ ప్రాంగణాలు, మార్కెట్‌లోని స్టాల్స్‌లో ప్రస్తుతం సబ్ లీజుదారులే తిష్ట వేసి ఉన్నారు. లీజు దారులు జీహెచ్ఎంసీ నుంచి ఏళ్ల క్రితం నామమాత్రం అద్దెకు వీటిని తీసుకుని, వీటిని సబ్ లీజుకిచ్చి ఇప్పుడు రూ. వేలు, లక్షల్లో అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. అద్దె గడువు ముగిసినవి, ఖాళీగా ఉన్న వాటికి టెండర్లు చేపట్టి, వేరే వారికి కేటాయించేందుకు అధికారులు కనీసం టెండర్ల ప్రక్రియను కూడా చేపట్టకపోవడంతో అద్దె గడువు ముగిసిన లీజుదారులకు, సబ్ లీజు దారులకు వరంగా మారుతుంది. ఖాళీగా ఉన్న సుమారు వెయ్యి 54 మలిగీలను అద్దెకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించాలని కొద్ది నెలల క్రితమే స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. అయినా అది అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఖాళీగా ఉన్న మలిగీలు, మార్కెట్లలోని స్టాల్స్‌ను అద్దెకు ఇచ్చేందుకు వేలం నిర్వహించాలని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు ప్రధాన కార్యాలయం అధికారులు మూడుసార్లు రిమైండర్లను జారీ చేసినా, కొన్ని సర్కిళ్లలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా వేలం నిర్వహించలేదు.

**ఏడాది క్రితం..**

గతేడాది కమిషనర్‌గా సేవలందించిన ఆమ్రపాలి.. మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా చిక్కడపల్లిలోని ఆధునిక మున్సిపల్ మార్కెట్‌ను నిర్మించినా, అద్దెదారులకు ఎందుకు కేటాయించలేదని మండిపడ్డారు. వెంటనే టెండర్లు చేపట్టి, అద్దెకు కేటాయిస్తే జీహెచ్ఎంసీకి నిధులు సమకూరుతాయని ఆదేశించారు. ఈ ఘటన జరిగి ఏడాది గడిచిపోయినా, ఇంకా చిక్కడపల్లి మార్కెట్ ఖాళీగానే ఉంది. దీంతో అధికారులు హడావుడిగా ఒకసారి టెండర్ల ప్రక్రియ చేపట్టారు. అద్దె దారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో టెండర్లు చేపట్టడం కూడా మరిచారు. ఇందుకు సంబంధించి చిక్కడపల్లిలో సర్వహంగులతో నిర్మించిన మార్కెట్




కాంప్లెక్స్‌కు తగినంత పార్కింగ్ స్పేస్ లేకపోవడంతో అద్దెదారులు ముందుకు రావడం లేదని సమాచారం. సిటీలోని ఇతర వ్యాపార సంస్థలకు వ్యాలెట్ పార్కింగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్న జీహెచ్ఎంసీ తన సొంత ఆస్తులను అద్దెకు ఇచ్చేందుకు, ఆదాయం పెంచుకునేందుకు తన మార్కెట్ భవనాలకు ఎందుకు వ్యాలెట్ పార్కింగ్ సిస్టమ్‌ను అమలు చేయదన్న ప్రశ్న తలెత్తుతుంది.

**ఆదాయం పెరిగినట్టే పెరిగి...**

జీహెచ్ఎంసీ ఆస్తుల లీజుకు కేటాయించడం, ప్రతినెల అద్దెలు చెల్లించడం వంటి బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీలో ఎస్టేట్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, దానికో అదనపు కమిషనర్‌ను సైతం నియమించారు. గత సంవత్సరం నవంబర్ మాసంలో జీహెచ్ఎంసీకి కమిషనర్‌గా ఇలంబర్తి వచ్చిన తర్వాత ఆయన చేసిన వత్తిడి, ఇచ్చిన టార్గెట్ల ప్రకారం 202324 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.4 కోట్లకే పరిమితమైన ఎస్టేట్ ఆదాయం ఆయన వచ్చిన తర్వాత లీజుదారులు, సబ్ లీజుదారులకు నిర్వహించిన హియరింగ్ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అద్దెలు వసూలు కావడంతో 202425 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నెలాఖరు కల్లా ఎస్టేట్ ఆదాయం రూ.6 కోట్లకు ఆకస్మికంగా పెరిగింది. ఇలంబర్తి కమిషనర్‌గా ఉన్నప్పుడు మార్చి నెలాఖరు కల్లా రూ.10 కోట్లు దాటించాలన్న టార్గెట్ పెట్టుకున్న అధికారులు ఆయన బదిలీ అయి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా తుస్సుమన్నారు. అప్పటి వరకు ఖాళీగా ఉన్న పలు ప్రాంతాల్లోని సుమారు 400 మలిగీలను రెండేళ్ల చొప్పున అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం ఎస్టేట్ విభాగం అధికారులు ఆ విషయాన్ని ప్రస్తావించేందుకు కూడా ఇష్టపడటం లేదని సమాచారం. కొద్ది నెలల క్రితం కమిషనర్‌గా వచ్చిన కర్ణన్ ప్రత్యేక చొరవ తీసుకుని, జీహెచ్ఎంసీ ఆస్తులను డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని ముమ్మరం చేసి, టెండర్ల ప్రక్రియ చేపట్టి ఆదాయాన్ని పెంచే దిశగా కృషి చేయాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

## వృద్ధ అనాధల మరణాలు నిత్యకృత్యమయ్యాయి...

- పరిష్కారం చూపండి సార్.
- ఎస్ హెచ్ఆర్ సీ చైర్మన్ కు ఏసీపీ విజ్ఞప్తి

**సికింద్రాబాద్, నవంబర్ 06 ( సిద్దిపేట పవర్ ) :**

గాంధీ ఆసుపత్రి ఆవరణలో అనాథల మరణాలు సర్వసాధారణంగా మారయ్యాయని, ఈ అంశంపై ఫోకస్ చేసి, పరిష్కారం చూపాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్ రెడ్డి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డా.షమీమ్ అక్తర్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీ ఆసుపత్రి విజిట్ కు వచ్చిన ఎస్హెచ్ఆర్సీ చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన ఏసీపీ ఈసందర్భంగా గాంధీ ఆవరణలో ప్రతి రోజు చోటు చేసుకుంటున్న గుర్తు తెలియని వృద్ధ యాచకుల మరణాల గురించి వివరించారు. ఈసమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



## గాంధీ ఆస్పత్రిని సందర్శించిన మానవ హక్కుల కమిషన్

- ఎమర్జెన్సీ వార్డు పీడియాట్రిక్ వార్డులను సందర్శించిన కమిషన్ చైర్మన్
- పేషంట్లకు అందే వైద్యం భేష్ అని డాక్టర్లకు కితాబు

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**


మానవ హక్కుల పరిరక్షణ చట్టం-1993 లోని సెక్షన్ 12(c) ప్రకారం తన విధుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గురువారం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అఖ్తర్, సభ్యులు (జుడీషియల్) శివాది ప్రవీణ, సభ్యులు (నాన్ జుడీషియల్) డా. బి. కిషోర్ (ఐఏఎస్ రిటైర్డ్) పాల్గొన్నారు. కమిషన్ కార్యదర్శి, సీఈఓ ఏ.ఎన్. కాంతి వెస్లీ (ఐఏఎస్), డిప్యూటీ రిజిస్ట్రార్ బి.వి.ఏ. విజయ్, ప్రజాసంబంధాధికారి పి.శ్రీనివాస్‌రావు, డీఎస్పీ రాములు తదితరులు వెంట ఉన్నారు. సూపరింటెండెంట్ డా. వాణి, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఇందిరా ఇతర వైద్యులు, చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, ఎస్ హెచ్ ఓ అనుదీప్ లు కమిషన్ బృందాన్ని ఆహ్వానించారు. కమిషన్ అధికారులు ముందుగా ఎమర్జెన్సీ వార్డును పరిశీలించి, విధుల్లో ఉన్న వైద్యులతో మాట్లాడారు. అనంతరం జెరియాట్రిక్ (వయోవృద్ధుల), పేడియాట్రిక్ (పిల్లల), పేడియాట్రిక్ సర్జరీ విభాగాలతోపాటు ఇతర విభాగాలను సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత వైద్యులు పేషంట్లతో కమిషన్ చైర్మన్ మాట్లాడి వారికి అందుతున్న వైద్యాన్ని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు తరువాత సూపరింటెండెంట్ ఛాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అఖ్తర్ గాంధీ ఆస్పత్రి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేడియాట్రిక్ సర్జరీ విభాగంలో జరుగుతున్న సేవలను ప్రశంసిస్తూ వైద్యులు, సిబ్బంది కృషిని అభినందించారు. నిత్యం వేలాదిమంది పేషెంట్లు, వారి సహాయకులు ఆసుపత్రికి వస్తుంటారని ఈ క్రమంలో కొంత ఇబ్బంది కలిగేది సహజమే అని అన్నారు ఇది ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రి లాగా కాదని నిత్యం ఎంతమంది పేషెంట్లు వచ్చిన కాదనకుండా ఇక్కడ డాక్టర్లు ఎంతో ఓపికతో వైద్యం చేయడం గొప్ప విషయం అన్నారు తెలంగాణలో ఇలాంటి ఆసుపత్రి ఉండటం గ్రేట్ అన్నారు. గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్.సునీల్, ఆర్ఎంఓ శేషాద్రి, డాక్టర్ యోగేందర్, పీడియాట్రిక్ హెచ్ ఓ డి డాక్టర్ నాగార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు



## ఎన్టీఆర్ ఇవాళ గుర్తుకు వచ్చారా..?
# సీఎం రేవంత్‌పై నామా నాగేశ్వర్ రావు ఫైర్

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎంపీ నామా నాగేశ్వర్ రావు నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాగానే ఎన్టీఆర్ విగ్రహం పెడతామని ఈరోజు ఆయన పేరు రేవంత్ రెడ్డి వాడుకుంటున్నాడు. తుమ్మల నాగేశ్వరరావు సత్తుపల్లి నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు, ఎందుకు ఎన్టీఆర్ విగ్రహం గుర్తుకురాలేదు అని నిలదీశారు. ఇవాళ నామా నాగేశ్వర్ రావు మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ అభిమాని మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో వచ్చిన ఎన్నికలో సునీతకు కేసీఆర్ అవకాశం ఇచ్చారు. మూడు సార్లు గోపీని ఆదరించినట్లే సునీతను ఆదరించాలి. 1983 నుంచి చివరి వరకు ఎన్టీఆర్ వెంట ఉన్న నేత మాగంటి గోపీనాథ్. పదేళ్లలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో, హైదరాబాద్‌లో కనీవిని ఎరగని అభివృద్ధి జరిగింది. హైదరాబాద్ అభివృద్ధి చూసే మొన్నటి ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించారు అని నామా నాగేశ్వర్ రావు గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి ఎన్టీఆర్ ఇవాళ గుర్తుకు వచ్చారా? ఖమ్మంలో 60 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని మేము పెట్టాం, ఎన్టీఆర్ చరిత్రను గ్రానైట్‌పై రాశాం. ఎన్టీఆర్ చరిత్ర ఉన్న గ్రానైట్ రాళ్లను తొలగించారు. ఇవాళ ఉప ఎన్నిక కోసం ఎన్టీఆర్ విగ్రహం అని మాట్లాడుతున్నారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశాం. రాజకీయ అవకాశాల కోసం అన్ని పార్టీలు తిరిగిన వారు రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియదు. సామాజిక వర్గం మొత్తం తనవైపే ఉందని చెప్పడం సరికాదు అని మాజీ ఎంపీ నామా పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని చూసి ప్రజలు తీర్పు ఇవ్వాలి. రెండేళ్ల కాంగ్రెస్ పాలన ఎలా సాగుతుందో అందరమూ చూ




స్తున్నాం. మాగంటి సునీతను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని నామా నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ ఇక్కడ స్థిరపడ్డ పక్క రాష్ట్రాల వారిని అక్కున చేర్చుకున్నాడు. రామోజీ రావును పక్కా రాష్ట్రం పోలీసులు అరెస్టు చేసేందుకు వస్తే, నా రాష్ట్రం నుండి ఎవరిని అరెస్టు చేయడానికి వీలు లేదని, రామోజీ రావు మీద చెయ్యి కూడా పడకుండా కేసీఆర్ అడ్డుకున్నాడు అని నామా నాగేశ్వర్ రావు తెలిపారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా కోట నీలిమ ప్రచారం

- జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ బరిలో ఉత్సాహం

**సికింద్రాబాద్, నవంబర్ 06 ( సిద్దిపేట పవర్ ):**

జూబ్లీహిల్స్‌ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌అభ్యర్థి వి.నవీన్‌యాదవ్‌కు మద్దతుగా పీసీసీ వైస్‌ప్రెసిడెంట్‌డాక్టర్‌కోట నీలిమ గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో ఆమె స్థానిక వ్యాపారస్తులు, అపార్ట్ మెంట్‌వాసులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్‌సిలిండర్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని విమర్శించారు. "కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి పథకం అమలు చేస్తోంది. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ప్రజల ఆశీర్వాదంతో నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో సనత్‌నగర్‌నియోజకవర్గ కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేపట్టాలి

- కపాస్ కిసాన్ యాప్ ను రద్దుచేసి రైతాంగానికి న్యాయం చేయాలి

**తెలంగాణ బ్యూరో, సిద్దిపేట పవర్ :**

పత్తి రైతులకు ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ,ఏఐకేఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం చేర్యాల మండల కేంద్రంలోని పలు సీసీఐ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో రైతాంగానికి తీవ్ర నష్టంతో ఆందోళన చెందుతున్న క్రమంలో లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే కేంద్రం రైతులను ఇబ్బందులకు గురి చేసే నిబంధనలు తీసుకురావడం వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కపాస్ యాప్ ద్వారా రైతులు స్మార్ట్ ఫోన్ లో ఒకరోజు ముందు స్లాట్ బుక్ చేసుకోవాలని, గతంలో ఎకరానికి 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సిసిఐ, ఈసారి 7 క్వింటాళ్లకు కుదించడం సబాబు కాదన్నారు. పత్తికి తేమ శాతం 12 నుంచి 20శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే ఆంక్షలు పెట్టి మరోసారి నడ్డి విరిచే విధంగా రైతన్నకి వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఈ కపాస్ యాప్ ను ఎత్తివేసి నేరుగా పాత పద్ధతిలోనే పత్తిని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పత్తి రైతులను ఏకం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తుల భాస్కర్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, ఎగుర్ల ఎల్లయ్య, నంగి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.




## జూబ్లీహిల్స్ గడ్డ పై గులాబీ జెండా గెలుపు ఖాయం

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి :**

జూబ్లీహిల్స్ ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశానుసారం మేరకు బీ ఆర్ యస్ పార్టీ గజ్వేల్ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ప్రజలు కాంగ్రెస్ మాయమాటలు కల్లిబొల్లి మాటలు నమ్మి ఓటేస్తే ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని అన్నారు. అదేవిధంగా 420 అమలు కానీ అమిలు ఇచ్చి ప్రజలు మోసపోయారని బీ ఆర్ యస్ కి ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపోంచాలని అన్నారు. ప్రచారం లో జగదేవపూర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి మండల మాజీ కో ఆప్షన్ సయ్యద్ ఇక్బాల్ మాజీ జిల్లా మాజీ ఎంపీటీసీ ల ఫోరమ్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ పీర్లపల్లి మాజీ సర్పంచ్ అంకిల్లా యాదవ్ రెడ్డి మధుసూదన్ రెడ్డి కొత్త శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నోని పండు లాభాలు తెలిస్తే అస్సలు నో చెప్పరు!



ఫలాలు..
మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చాలా మందికి తెలుసు. వీటిలో ఫలానా పండు మంచిది.. ఫలాతా పండు చెడు చేస్తుందని అనడానికి లేదు. ఏది ఎప్పుడు తీసుకుంటున్నాము అన్న దానిపై ఆధారపడే వాటి ప్రభావం ఉంటుంది. వీటి నుంచి 'నోని' పండు ఏమీ మినహాయింపు కాదు. కానీ ఈ పండు గురించి చాలా తక్కువ మందికే తెలుసు. అసలు ఈ పేరుతో ఒక పండు ఉందని కూడా చాలా మందికి తెలియదు. ఇక దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు కూడా అంతే. దనినే 'తొగరు పండు' అని కూడా అంటారు. దీనిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు బోలెడున్నాయని ఆరోగ్య నిపుణులు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వీటిని ప్రస్తుతం విరివిగానే పండిస్తున్నారు. ఈ పండు చూడటానికి బంగాళ దుంప ఆకారంలో పసుపు, లేత ఆకుపచ్చ రంగుల్లో ఉంటుంది. ఈ పండులో లోపల చిన్నచిన్న విత్తనాలు ఉంటాయి. మన ఆరోగ్యానికి నోని పండు చేసే ప్రయోజనాలు చెప్తే నో అనకుండా లాగించేస్తారని నిపుణులు అంటున్నారు.

నోనీ పండులో విటమిన్లు, మినరల్స్, పోషకాలు అన్నీ సమృద్ధిగా ఉంటాయి. ఇందులో విటమిన్ సీ, బయోటిన్, ఫోలేట్, విటమిన్ ఈ, మొక్కల ఆధారిత ఫ్లేయనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్స్ అన్నీ ఎక్కువగానే ఉంటాయి. వీటిని తినడం వల్ల ఎన్నో చిన్న చిన్న రోగాల నుంచి పెద్దపెద్ద వ్యాధులు రాకుండా కూడా నిలువరిస్తుంది. మన రోగ నిరోధక శక్తిని పెంచడంలో కూడా నోని పండు అద్భుతంగా పనిచేస్తుంది. ఎలర్జీలు, చిన్నచిన్న రుగ్మతలు ఇలా మరెన్నో రోగాలు రాకుండా ఈ పండు మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది. గుండె ఆరోగ్యానికి, నాడీ వ్యవస్థకు, ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల వచ్చే నొప్పులు, కీళ్ల నొప్పులు, అలసట ఇలా చెప్పుకుంటూ పోతే పెద్ద లిస్టే వస్తుంది. వాటన్నింటి నుంచి మనల్ని కాపాడటంలో నోని పండు ఉపయోగపడుతుందని వైద్యులు చెప్తున్నారు. వాటిలో కొన్ని ఏంటో తెలుసుకుందాం.

**కణాలకు కంచు కోట:**
శరీరంలోని ఫ్రీ రాడికల్స్ కారణంగా దెబ్బ తిన్న కణాలను రిపెయిర్ చేయడంలో నోని పండు దివ్యఔషధంలా పనిచేస్తుంది. అంతేకాకుండా కణాలను కాపాడటంతో పాటు వాటికి కంచుకోట లాంటి రక్షణను అందించడంలో కూడా నోని పండు అద్భుతంగా పనిచేస్తుంది. నోని జ్యూస్ తాగడం వల్ల కూడా శరీరంలో శక్తి లేమి అన్న భావన లేకుండా ఉంటుంది. రోజంతా ఫుల్ ఎనర్జిటిక్‌గా పనిచేయగలుగుతాం. దాంతో పాటుగా కండరాలు అరిగిపోకుండా కూడా కాపాడుతుంది ఈ పండు.

**న్యూట్రియెంట్ల స్టోర్ హౌస్:**
నోని పండ్లలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. దీనినే ఫైటో న్యూట్రియెంట్ల స్టోర్ హౌస్‌గా కూడా పిలుస్తారు నిపుణులు. అంతేకాకుండా ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. తీసుకున్న ఆహారాన్ని శక్తిగా మార్చడంతో పాటు మన జీవక్రియను సమతుల్యం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తుంది.

**హైపర్ టెన్షన్‌కు చెక్:**
నోని పండ్లు తినడం ద్వారా హైపర్ టెన్షన్‌కు చెక్ చెప్పొచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది మన హైపర్ టెన్షన్, బ్లడ్ ప్రెజర్‌ను అదుపులో ఉంచడానికి బాగా పనిచేస్తుంది. లక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడానికి, రక్త నాళాలు, రక్త ప్రసరణను సక్రమంగా ఉండేలా చూడటంలో కూడా పొటాషియం సహాయపడుతుంది.

దీంతో పాటుగానే రుమటాయిడ్ ఆర్థరైటిస్, గౌట్, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల వచ్చే కీళ్ల నొప్పులను తగ్గించడంలో కూడా నోని పండు బాగా పనిచేస్తుంది. రోజుకు ఒకటి నుంచి రెండు గ్లాసుల నోని పండు జ్యూస్ తాగితే ఈ నొప్పుల నుంచి బయటపడొచ్చని అంటున్నారు వైద్య నిపుణులు.



# నకిలీ గుడ్లను ఎలా కనుక్కోవాలి

కోడి గుడ్లు పోషకాలకు మూలం. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిరోజు గుడ్లు తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆహారంలో గుడ్లు ఒక ముఖ్యమైన భాగం. వైద్యులు కూడా క్రమం తప్పకుండా గుడ్లు తినాలని సిఫార్సు చేస్తున్నారు. కానీ ఇటీవల, మార్కెట్లో నకిలీ గుడ్ల సంఖ్య బాగా పెరిగింది. నకిలీ గుడ్లు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే నకిలీ గుడ్లు – నిజమైన గుడ్లు మధ్య తేడాని ఇపుడు తెలుసుకుందాం. నిజమైన గుడ్లు సహజమైన ఆకృతిని కలిగి ఉంటాయి, అయితే నకిలీ గుడ్లు తరచుగా మృదువుగా మరియు మెరుస్తూ ఉంటాయి. వాటి షెల్, ధ్వని, బరువు మరియు వాసనను చూడటం ద్వారా మీరు నిజమైన మరియు నకిలీ గుడ్ల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించవచ్చు.నిజమైన గుడ్డు యొక్క షెల్ సాధారణంగా కరుకుగా ఉంటుంది మరియు స్పర్శకు కొద్దిగా ధాన్యంగా ఉంటుంది. ఇది చిన్న, సహజ లోపాలను కలిగి ఉండవచ్చు.


**షెల్ :**
నిజమైన గుడ్లు – నిజమైన గుడ్డు షెల్ సాధారణంగా గరుకుగా ఉంటుంది. అలాగే స్పర్శకు కొద్దిగా ధాన్యంగా ఉంటుంది.
నకిలీ గుడ్లు – నకిలీ గుడ్డు షెల్ తరచుగా చాలా మృదువైన మరియు ఏకరీతిగా ఉంటుంది, ఇది నిజమైన గుడ్డు షెల్ కంటే మెరుగ్గా కనిపిస్తుంది.

**సౌండ్ టెస్ట్ :**
నిజమైన గుడ్డు – పచ్చసొన మరియు తెలుపు గట్టిగా కప్పబడి ఉండటం వలన కదిలించినప్పుడు శబ్దం రాదు.
నకిలీ గుడ్లు – లోపల ద్రవం ఉండటం వలన కదిలించినప్పుడు శబ్దం వస్తుంది.

**షెల్ సమగ్రత :**
నిజమైన గుడ్డు – నిజమైన గుడ్డు యొక్క పెంకు సాపేక్షంగా పెళుసుగా ఉంటుంది మరియు పగులగొట్టినప్పుడు సులభంగా విరిగిపోతుంది.
నకిలీ గుడ్డు – నకిలీ గుడ్డు యొక్క షెల్ తరచుగా గట్టిగా ఉంటుంది మరియు పగులగొట్టడం కష్టం.ఇది ముక్కలు కాకుండా పెద్ద, ప్లాస్టిక్ వంటి ముక్కలుగా విరిగిపోవచ్చు.

**పచ్చసొన మరియు తెల్లసొన స్థిరత్వం :**
నిజమైన గుడ్డు – పగిలినప్పుడు, నిజమైన గుడ్డు యొక్క పచ్చసొన గుండ్రంగా మరియు గట్టిగా ఉంటుంది, అయితే గుడ్డులోని తెల్లసొన స్పష్టంగా మరియు కొద్దిగా ద్రవంగా ఉంటుంది.
నకిలీ గుడ్డు – నకిలీ గుడ్డు యొక్క పచ్చసొన తక్కువ గుండ్రంగా ఉండవచ్చు మరియు విరిగిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గుడ్డులోని తెల్లసొన చాలా స్పష్టంగా మరియు అసాధారణ స్థిరత్వం కలిగి ఉండవచ్చు, తరచుగా చాలా మందంగా లేదా చాలా నీళ్ళతో ఉంటుంది.

నకిలీ గుడ్లు తినడం వల్ల వాటి ఉత్పత్తిలో ఉపయోగించే రసాయనాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ సింథటిక్ పదార్థాలు జీర్ణశయాంతర సమస్యలు, అలెర్జీ ప్రతిచర్యలు మరియు ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. నకిలీ గుడ్లను దీర్ఘకాలికంగా తీసుకోవడం వల్ల మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి, వీటిని గుర్తించడం మరియు నివారించడం చాలా ముఖ్యం. గుడ్లు తినడం వల్ల వాటి ఉత్పత్తిలో ఉపయోగించే రసాయనాల వల్ల అనేక ఆరోగ్య ప్రమాదాలు ఎదురవుతాయి.



# నిమ్మ నీటితో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు..!

రోజు పరగడుపున గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. ఈ విషయం దాదాపు అందరికీ తెలుసు. ఇటీవలి కాలంలో చాలా మంది బరువు తగ్గడం కోసం రోజు ఉదయాన్ని నిమ్మరసం, తేనె కలుపుకుని గోరువెచ్చని నీరు తాగుతున్నారు. అయితే నిమ్మరసాన్ని పరగడుపునే కాదు భోజనం చేసిన తర్వాత కూడా తీసుకోవచ్చని, ఇలా చేయడం కూడా బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.
అంతేకాకుండా నిమ్మరసం కేవలం బరువు తగ్గడం కోసమే కాకుండా.. మరెన్నో ఆరోగ్య సమస్యలకు కూడా అద్భుతంగా పనిచేస్తుందని చెప్తున్నారు. భోజనం చేసిన తర్వాత గ్లాసుడు నీళ్లలో రెండు నిమ్మ చెక్కలు పిండుకుని ఆ నీళ్లు తాగితే అది మన శ్వాసను చాలా ఫ్రెష్‌గా ఉంచుదుందని నిపుణులు వివరిస్తున్నారు.
దాంతో పాటుగా నోరు పొరిబాడకుండా కూడా నిమ్మరసం కాపాడుతుందని, దాంతో పాటుగా నిమ్మకాయల్లో ఉండే సిట్రిక్ యాసిడ్, కాల్షియం.. కిడ్నీ రాళ్లు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. యూరిక్ యాసిడ్ వల్ల వచ్చే కీళ్ల నొప్పుల నుంచి కూడా ఇది ఉపశమనం కల్పిస్తుందని వైద్యులు వివరిస్తున్నారు.
జీర్ణ ప్రక్రియ: భోజనం చేసిన తర్వాత నిమ్మరసం తీసుకోవడం వల్ల మన జీర్ణప్రక్రియ సాఫీగా సాగుతుందని నిపుణులు చెప్తున్నారు.
అంతేకాకుండా జీర్ణక్రియ వేగంగా జరగడంలో కూడా నిమ్మరసం ఉపయోగపడుతుందని, దాంతో పాటుగా జీర్ణ సమస్యలను తగ్గించడంలో, రాకుండా చేయడంలో కూడా నిమ్మరసం ఉపయోగపడుతుంది. దాంతో పాటుగా గుండె, మెదడు, నరాల పనితీరును కూడా నిమ్మరసం మెరుగుపరుస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఇమ్యూనిటీ బూస్టర్: ఆహారం తర్వాత నిమ్మరసం తాగడం మన ఇమ్యూనిటీని కూడా పెంచుతుంది. నిమ్మకాయల్లోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సహా మరిన్ని పోషకాలు ఇందులో కీలకంగా పనిచేస్తాయి. ఇవి శరీర పీహెచ్ స్థాయిని సమతుల్యం చేయడంలో కూడా బాగా పనిచేస్తాయి. తిన్న తర్వాత నిమ్మరసం తాగడం వల్ల ఎసిడిటీ సమస్యలు కూడా రాకుండా నివారిస్తుంది.
అదే విధంగా మన చర్మ ఆరోగ్యానికి కూడా నిమ్మరసం బాగా పనిచేస్తుంది. చర్మ ఆరోగ్యానికి కీలకమైన కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో నిమ్మకాలు అద్భుతంగా పనిచేస్తాయి. మెరిసే చర్మం కోసం తిన్న తర్వాత నిమ్మరసం తాగొచ్చని నిపుణులు అంటున్నారు.
ఒత్తిడి: శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా నిమ్మరసం అద్భుతంగా పనిచేస్తుంది. దాంతో పాటుగా నిమ్మకాయల్లో ఉండే ఆమ్లాలు.. కడుపులో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను తగ్గించడానికి ఉపయోగపడుతుంది.
నిమ్మకాయ నీళ్లు గ్యాస్ట్రోఇంటెస్టినల్ రిఫ్లక్స్ వ్యాధి నుంచి ఉపశమనం కూడా కల్పిస్తుంది. టాక్సిన్స్‌కు టెర్రర్: సాధారణంగా నిమ్మకాయ రసం ది బెస్ట్ డీటాక్స్‌గా చెప్తారు. రోజూ నిమ్మరసం తీసుకోవడం ద్వారా మన శరీరంలో ఉండే టాక్సిన్స్‌ను, హానికరమైన కణాలను బయటకు పంపడంలో కీలకంగా పనిచేస్తాయి. అదే విధంగా మన రక్తాన్ని శుద్ధి చేయడంలో కూడా నిమ్మరసం అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ బోజనం తర్వాత నిమ్మరసం తాగితే శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ కూడా కరుగిపోతుంది. రక్తపోటును నియంత్రించడంలో కూడా నిమ్మరసం బాగా పనిచేస్తుంది.

